క్లుప్తంగా

6న చౌడేపల్లెలో మంత్రి ప్రారంభోత్సవాలు

చౌడేపల్లె: మండలంలోని పలు ప్రాంతాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అమినిగుంటలో ఆర్‌ఓ ప్లాంట్, అమినిగుంట చెరువు, చౌడేపల్లె, కొండామర్రి, దిగువపల్లె, కాగతి, కాటిపేరి, పుదిపట్ల, పెద్దయల్లకుంట్ల ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లను మంత్రి ప్రారంభిస్తారని తెలియజేశారు. అలాగే బోయకొండలో విద్యుదీకరణ పనుల ప్రారంభం, నూతన కళ్యాణ కట్ట నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు విధిగా హాజరు కావాలని కోరారు.

6న మండల సమావేశం

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 6వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

7 నుంచి గడప గడపకు..

గుడుపల్లె: మండలంలోని 11గ్రామ పంచాయతీలలో ఈ నెల 7నుంచి 25వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ నిర్వహించనున్నారని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. 7, 8న గుడుపల్లె, 9న దాసిమానిపల్లె, 10న పాగురుపల్లె, 11, 12న సంగనపల్లె, 13, 14న చిన్నగొల్లపల్లె, 16, 17న శెట్టిపల్లె, 18న గుండ్లసాగరం,19, 20న యామగానిపల్లె, 21న అగరం, 22, 23న ఓయస్ కొత్తూరు, 24, 25న కుప్పిగానిపల్లెలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

పులిచెర్ల(కల్లూరు): శ్రావణ మాసం సందర్భంగా మండలంలో దేవళంపేటలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజార్చనలు, అభిషేకం నిర్వహించారు. భక్తులకు అర్చకులు అనంతాచార్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రొంపిచెర్ల పీహెచ్‌సీ తనిఖీ


పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా పోగ్రాం అధికారి హర్షవర్ధన్

రొంపిచెర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రపంచ ఆరోగ్య మిషన్ జిల్లా పోగ్రాం అధికారి డాక్టర్ హర్షవర్ధన్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కార్యక్రమాలపై సలహాలు–సూచనలు ఇచ్చారు. అలాగే ఈ నెల 10న నిర్వహించనున్న నులి పురుగుల దినం ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రిజ్వాన్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ ఆర్థిక సాయం


రత్నమ్మకు నగదు అందజేస్తున్న నాయకులు

కుప్పం రూరల్: మండలంలోని చీగలపల్లెకు చెందిన రామప్ప (62) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ రామప్ప కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థికసాయం ప్రకటించారు. శుక్రవారం ఉదయం 2వ వార్డు కౌన్సిలర్ మునిరాజు ఆ సొమ్మును మృతుడి భార్య రత్నమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సంపత్, శేషాద్రి, రాజా, ఆనంద్, మునిరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట సచివాలయం వద్ద వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి(బెంగళూరు) వైద్యులు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లోకేష్ భరణి 160 మందికి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 14 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి రెఫర్ చేసినట్లు చెప్పారు. శిబిరాన్ని సర్పంచ్ అరుణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

● ఎమ్మెల్సీ భరత్


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్, నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వైఎస్‌ఆర్ సీపీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. కెనమాకులపల్లె పంచాయతీ బోయనపల్లెలో శుక్రవారం రాత్రి కార్యకర్తల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లోని సానుకూలతను ఓట్లుగా మలచాలని కోరారు. 'మా నమ్మకం నువ్వే జగన్', 'గడప గడపకు మన ప్రభుత్వం', 'జగనన్న సురక్ష' వంటి కార్యక్రమాలతో నిత్యం పార్టీ ప్రజలతోనే ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జనానికి మరింత చేరువ కావాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ మళ్లీ తప్పుడు హామీలు, అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రారంభించిందని, వీటిని సమర్థవంతంగా తిప్పికొడుతూ, ప్రజలకు వాస్తవాలను తెలియజెప్పాలని కోరారు. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు కేశవులు, రమేష్‌ను అభినందించారు. నిజానికి–అబద్ధానికి ఉన్న తేడాను గుర్తిస్తే మిగతా టీడీపీ వారు కూడా జగనన్నకు జై కొడతారని చెప్పారు.

పార్టీలో చేరిక

బోయనపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు రాజగోపాల్, హనుమంతు, శరవణ, సత్యనారాయణ, నటరాజ్ తమ కుటుంబాలతో సహా వైఎస్‌ఆర్ సీపీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించడంతో తాము ఆకర్షితులైన పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. ఎమ్మెల్సీ భరత్ వారికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, ఎంపీపీ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, పెద్దన్న, సుకుమార్, కుప్పం మండల పార్టీ కన్వీనర్ మురుగేష్, స్థానిక సర్పంచ్ ఏవీ జయరాం, ఎంపీటీసీ రాజప్ప, నాయకులు చక్రపాణిరెడ్డి, వినోద్, జోని రామ్మూర్తి, అప్పిరెడ్డి, జగన్, వీరభద్రప్ప, బుజ్జి, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం


ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లి: విద్యార్థులకు కడుపులో ఉన్న నులి పురుగులను నివారించడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యాధికారులు అన్నారు. ఈనెల 10వ తేదీ జాతీయ నులి పురుగల నివారణ దినం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓలు సాయిలీల, సుబ్రమణ్యంలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్ మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజి, హెచ్ఎం విశ్వనాథయ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కుప్పం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తంబిగానిపల్లె ప్రధానోపాధ్యాయులు లోకేష్ అన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో మొక్కలు నాటారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'మేరి మట్టి..మేరి దేశ్' నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థి దశ నుంచే తీసుకోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటడం, నీటి వృధాను అరికట్టడం, చెట్ల నరికివేతను అడ్డుకోవడం, వర్షపు నీటిని నిల్వ చేయడం..ఇత్యాది పనులు చేయాలన్నారు. అప్పుడే పర్యావరణ పరిరక్షణకు తోడ్పడినవారవుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు మనోహర్, ఉపాధ్యాయులు మాధవన్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో గుడివంక ఆలయ గంగ పూజలు


గంగ పూజలు చేస్తున్న వేద పండితులు

గుడుపల్లె: మండలంలోని గుడివంక శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు శుక్రవారం పశ్చిమ వాహినిలో వేదపండితులు గంగపూజలు నిర్వహించారు. ఆలయం నుంచి వేదపండితులు కలశాలను తీసుకుని గంగ పూజ అనంతరం హరో హర నామస్మరణ చేస్తూ, పశ్చిమ వాహిని మెట్లు ఎక్కి, స్వామి వారికి పూర్ణకుంభ పూజలు చేశారు. గంగపూజ అనంతరం భక్తులు నెల రోజులు ఉపవాస దీక్షలతో గంగ పూజలు చేసి, కావడి మొక్కులు చెల్లించడం పరిపాటి. అనంతరం కలశ స్థాపన చేసి వేద పండితులు హోమాలు, నవగ్రహాలు పూజలు చేశారు.

రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాల పంపిణీ


గడ్డి కత్తిరింపు యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

చౌడేపల్లె: మండలంలో 61 మంది పాడి రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలను (చాఫ్ కట్టర్లు)ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ రామమూర్తి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ రాయితీపై ఇస్తున్న మెషిన్లతో జొన్న, మొక్క జొన్న పంటను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి, పశువులకు మేతగా వేయవచ్చని, దీని వల్ల పశుగ్రాసం వృథా కాదన్నారు. అంతేకాకుండా పాల దిగుబడి 10 శాతం మేరకు పెరుగుతుందని పేర్కొన్నారు. ఇంకనూ కావలసిన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలన్నారు. అనంతరం పశువైద్యులు మాట్లాడారు. రైతులు అధిక పాల దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీరాములు, పశు వైద్యాధికారులు పవన్‌కుమార్, దినేష్ రెడ్డి సిబ్బంది రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం సొసైటీకి రెండోస్థానం


అవార్డు అందుకుంటున్న సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి

పాలసముద్రం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాలసముద్రం సొసైటీకి ద్వితీయ స్థానం వచ్చిందని సింగిల్ విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన 'ద ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు లిమిటెడ్ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే పాలసముద్రం సొసైటీ మంచి పనితీరు కనబరిచి ద్వితీయ స్థానం రావడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.

కోనేటిరాయునికి దాతల కైంకర్యాలు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం ఇద్దరు దాతల సౌజన్యంతో స్వామివారి అభిషేకం, కైంకర్యాలు నిర్వహించినట్లు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ గజేంద్ర తెలిపారు. శ్రీవారి భక్తులు సాయినగర్‌కు చెందిన నేహా చెంగప్ప, అరగొండ గొల్లపల్లెకు చెందిన హరిబాబు స్వామివారి సేవకు రూ.10 వేల చొప్పున ఆలయానికి చెల్లించారు. దీంతో ఉదయం సుప్రభాతసేవ నుంచి అభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్యం, రాత్రి ఏకాంతసేవ వరకూ జరిగే శ్రీవారి కైంకర్యాలను దాతల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు.

బదిలీ టీచర్‌కు సన్మానం


టీచర్ ఇందిరను సన్మానిస్తున్న దొరస్వామి, హెచ్ఎం రెడ్డి విజయ

పెద్దపంజాణి: మండలంలోని నడింపల్లె ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఇందిర కమ్మపాళ్యం పాఠశాలకు బదిలీ అయ్యారు. పాఠశాల హెచ్ఎం రెడ్డి విజయ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొరస్వామి శుక్రవారం వీడ్కోలు సన్మానం చేశారు. పలువురు ఆమె సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు డిష్యుం..డిష్యుం

పలమనేరు: మండలంలోని గొల్లపల్లె వద్ద బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు రెండు గ్రూపులుగా కొట్టుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బస్సుల్లోనూ, స్థానిక ఆర్టీసీ బస్టాండు, గ్రామాల్లోని బస్ స్టాపుల్లో విద్యార్థులు గొడవలు సర్వసాధారణమయ్యాయి. విద్యార్థుల గొడవలు, వీరి ఆగడాలు స్థానికులకు చిరాకెత్తిస్తోంది. చదువుకోవాల్సిన వయసులో వీరిలా వ్యవహరిస్తుండటంపై అటు తల్లిదండ్రులు, పోలీసులు దృష్టి సారించి, కట్టడి చేయాల్సి ఉంది.

టీడీపీ విధ్వంస కాండపై నేడు నిరసన, బంద్

పలమనేరు: పుంగనూరులో చంద్రబాబు ప్రోద్బలంతో టీడీపీ శ్రేణులు పోలీసులపై దాడులు చేసి, విధ్వంసాన్ని సృష్టించినందుకు నిరసనగా శనివారం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు భరత్ పిలుపు మేరకు బంద్ చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బంద్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గణిత ప్రజ్ఞాధారణ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో శనివారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గణితావధాని అరుణ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించనునట్లు వెల్లడించారు.

చిత్తూరులో వేడుకగా ఆడిపూజ




ఆటోనగర్‌లో కొలువుదీరిన నాగాలమ్మ, అంకాళపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో శ్రీఅంకాళపరమేశ్వరి అమ్మవారు

చిత్తూరు రూరల్: ఆరగించమ్మా...ఆడిపూజ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. నగరంలో శుక్రవారం ఆడిపూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామునుంచే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. బహురూపాల్లో దేవతలు దర్శనమిస్తూ, భక్తులను కటాక్షించారు. సంతపేటలోని నాగాలమ్మ జాతరలో భాగంగా వీధిలో అమ్మవారిని కొలువుదీర్చారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే సీ.కే బాబు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. గుర్రప్పనాయుడు వీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో పసుపుతో అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్దారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూలస్థానంలోని అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యంగా అంబలి, పిండి వంటలను సమర్పించారు. మొక్కులు చెల్లించుకుని తర్వాత అమ్మవారి పసుపు కోసం ఎగబడ్డారు. ఎస్టేట్‌లోని ఆటోనగర్‌లో నాగాలమ్మను కొలువుదీర్చి అంబలిపోశారు. ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కే ఎం కుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు.

గాయపడిన పోలీసులకు పరామర్శ



గాయపడిన పోలీసులను పరామర్శిస్తున్న భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్ తదితరులు

పుంగనూరు: తెలుగుదేశం పార్టీ శ్రేణుల దాడుల్లో తీవ్ర గాయాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సీఐ భాస్కర్, ఎస్ఐ బాబు, పోలీసులను పలువురు పరామర్శించారు. శుక్రవారం రాత్రి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. గాయపడిన పోలీస్ అధికారులు, పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైద్యులను ఆదేశించారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ తెలిపారు.

ఇంద్రధనస్సు కార్యక్రమంపై అవగాహన


ఇంద్రధనస్సు కార్యక్రమంపై సమీక్షిస్తున్న అధికారులు

పలమనేరు: ఈనెల 7 నుంచి 12 వరకు పలమనేరు మున్సిపాలిటీ, మండలంలో వైద్యశాఖ నిర్వహించే ఇంద్రధనస్సు కార్యక్రమంపై ఏఎన్ఎంలకు ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా మలేరియా అధికారి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వరకూ తప్పకుండా టీకాలు వేయించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీన్ని ప్రజల్లోకి విస్తృత ప్రచారం చేయాలని అధికారులు సూచించారు. సమావేశంలో వైద్య, అభివృద్ధి, విద్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు, మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

కొలమాసనపల్లెలో సీఆర్‌సీ సమావేశం


బదిలీ అయిన హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు లీలారాణి, బాలసుబ్రమణ్యం హాజరై గ్రేస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం ఎంఈఓలను, ఇదే పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్ఎం విజయకుమార్‌ను సన్మానించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో జెడ్పీ చైర్మన్


వినాయకుని సేవలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాస్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాస్ దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం, అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


పొలంబడిలో భాగంగా ఆకులు కత్తిరిస్తున్న అధికారులు, సిబ్బంది

గుడిపాల: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని అగ్రికల్చర్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొలం పరిసరాల్లో విశ్లేషణ, శత్రు, మిత్ర పురుగులపై అవగాహన, వాటి జీవితచక్రంతో పాటు పంటను ఏ విధంగా కాపాడుకోవాలి అన్న అంశాలను వివరించారు. పురుగుమందులు వాడకుండా వేపగింజల కషాయాన్ని వాడాలని సూచించారు. వేరుశనగలో అంతరపంటగా ఆముదం, కంచె పంటగా జొన్నసాగు చేస్తే చీడపీడలు నివారించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి ఉపయోగపడే పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆకుల కత్తిరింపు ప్రయోగం చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు యోగప్రియ, లేష్మ, హనుమనాయక్, భువనేశ్వరి, నవీన్, వాణి పాల్గొన్నారు.

వేచి చూసి వెనుదిరిగిన టీడీపీ నేతలు


వెనుదిరుగుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : నిరీక్షించి వెనుతిరగాల్సి వచ్చిందని పలువురు టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లా పర్యటన నేపథ్యంలో చిత్తూరు నగరానికి సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్లో నిరీక్షించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఆ పార్టీ నేతలు రాత్రి 7 గంటల వరకు వేచిచూశారు. అయితే పర్యటన రద్దు అయినట్లు తెలియడంతో ఆ హోటల్ నుంచి వెనుదిరిగారు. రోడ్డు పైకి వచ్చి నిరసనలు చేసేందుకు ప్రయత్నించగా అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు టీడీపీ నేతలను చెదరగొట్టారు.

వైభవంగా అలుగుకుండ ఉత్సవం


అలుగును ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో నిర్వహిస్తున్న ద్రౌపదమ్మ తిరనాళ్లలో భాగంగా శుక్రవారం అలుగుకుండ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ ఆధ్వర్యంలో పసుపు వస్త్రాలు ధరించిన భక్తులు అలుగు కుండను తలపై ఉంచుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలోని ద్రౌపదమ్మ విగ్రహం సమీపంలో అలుగును ఉంచారు. కార్యక్రమాన్ని వీక్షించడానికి ఆలయం వద్ద అధికసంఖ్యలో భక్తులు విచ్చేశారు. అలుగుతో పాటు ప్రత్యేక అలంకరణలో ఉన్న ద్రౌపదీ, ధర్మరాజ స్వాములను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు.

డ్వాక్రా సంఘాల సభ్యులతో సమీక్ష


మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో పొదుపు సక్రమంగా కట్టుకుని పొదుపుల్లో నగదు పెంచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్రలు, వీఓ లీడర్లకు ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ అంతర్గత ఆడిట్, బహిర్గత ఆడిట్ పాలసీలు, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ వారు ఇచ్చిన సూచనలను అమలు పరచాలన్నారు. మండల మహిళ సమాఖ్య పరిధిలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై వివరించారు. బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంబంధిత సంఘమిత్ర, లీడర్లపై ఉందని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, లీడర్లు పాల్గొన్నారు.

దుకాణాల బహిరంగ వేలం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసే దుకాణాల వద్ద రుసుము వసూళ్లకు ఈనెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 27 వరకు గల 18 రోజుల లీజుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.